నమస్తే తెలంగాణ

ములుగు
జయశంకర్ భూపాలపల్లి


5 | శుక్రవారం 5 జనవరి 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

## ఆర్మీ బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీలో ప్రవేశాలకు ఎంపికలు

హనుమకొండ చౌరస్తా, జనవరి 4 : మద్రాస్ ఆర్మీ బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీ, బెంగళూరు ఇంజినీర్స్ గ్రూప్ అండ్ సెంటర్ నిర్వహిస్తున్న ఆలిండియా ఓపెన్ సెలక్షన్స్ ద్వారా ఆర్మీ బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీలో ప్రవేశాలు కల్పించేందుకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి గుగులోత్ అశోక్‌కుమార్ నాయక్ తెలిపారు. బాక్సింగ్, హాకీ, స్విమ్మింగ్, సెయిలింగ్ క్రీడల్లో ఫిబ్రవరి 5 నుంచి 8వ తేదీ వరకు బెంగళూరులో సెలక్షన్స్ నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు పాల్గొనాలని కోరారు.

## పాలిటెక్నిక్ సెకండియర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ చౌరస్తా, జనవరి 4 : ఐటీఐలలో రెండు సంవత్సరాల(ఎన్‌సీవీటీ) వ్యవధి గల కోర్సుల్లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో ప్రవేశం కోసం బ్రిడ్జ్ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జుమ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.




### గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా షెడ్యూల్

**ఓటర్ల నమోదు ప్రకటన : 2023, డిసెంబరు 30**

**దరఖాస్తుకు తుది గడువు : ఫిబ్రవరి 6 .. ఓటరు ముసాయిదా: ఫిబ్రవరి 24**

**అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ : ఫిబ్రవరి 24 నుంచి మార్చి 14**

**పరిష్కారం : మార్చి 29లోపు .. ఓటర్ల తుది జాబితా ప్రకటన : ఏప్రిల్ 4**



వరంగల్, జనవరి 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజక వర్గం ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. 2023 డిసెంబర్ 30 నుంచి ఓటరు నమోదు ప్రక్రియ మొదలైంది. ఓటరు నమోదు కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని, ప్రక్రియను పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ల నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కోసం కేంద్ర ఎన్నికల సంఘం 2023 నవంబర్ 1 క్వాలిఫైయింగ్ తేదీగా ప్రకటించింది. ఈ తేదీకి మూడేండ్ల ముందు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారికి ఓటరుగా అవకాశ ముంటుంది. ప్రతి ఒక్కరు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని, ఇందుకోసం ప్రచారం చేయాలని ఎన్నికల కమిషన్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. ఆయా జిల్లాల కలెక్టర్లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించనుండగా ఓటరు నమోదు, జాబితా తయారీ, ఎన్నికల నిర్వహణ వీరి పరిధిలోనే జరుగనుంది.



## పట్టభద్రుల ఉప ఎన్నికకు

# వేగంగా ఏర్పాట్లు

### మొదలైన ఓటరు నమోదు ప్రక్రియ

- **ఫిబ్రవరి 6వరకు గడువు.. ఏప్రిల్ 4న తుది జాబితా**
- **ఎన్నికల అధికారులుగా కలెక్టర్లు**
- **ఓటరు నమోదుపై హనుమకొండ కలెక్టర్ సమీక్ష**

గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇటీవలి ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఈ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం మొదటి నుంచీ బీఆర్‌ఎస్‌కు బలమైన స్థానంగా ఉంది. ఇక్కడ జరిగిన ప్రతి ఎన్నికలోనూ బీఆర్‌ఎస్ గెలిచింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనమండలి ఏర్పాటు కోసం 2007లో జరిగిన మొదటి ఎన్నికలో ఈ స్థానంలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కపిలవాయి దిలీప్‌కుమార్ గెలిచారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్‌ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలతోపాటు ఎమ్మెల్సీలు రాజీనామా చేయడంతో ఈ స్థానం ఖాళీ అయ్యింది. 2009లో ఉప ఎన్నిక జరుగగా బీఆర్‌ఎస్ విజయం సాధించింది. పదవీ కాలం పూర్తి కావడంతో 2015 మార్చిలో జరిగిన ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఘన విజయం సాధించారు. 2021లో జరిగిన ఎన్నికల్లోనూ పల్లా రాజేశ్వర్‌రెడ్డి రెండోసారి గెలిచారు.

### ఓటరుగా నమోదు చేసుకోండి : కలెక్టర్ సిక్తాపట్నాయక్

ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల పరిధిలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు హక్కు కోసం గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు ఓటరుగా నమోదు చేసుకోవాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుపై జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో ఆమె సమావేశం నిర్వహించారు. 2023 నవంబర్ 1కి మూడేండ్ల ముందు డిగ్రీ, డిప్లొమా, తత్సమాన విద్యార్హత కలిగిఉన్న గ్రాడ్యుయేట్లు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రభుత్వామోదిత విద్యాసంస్థల్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు నమోదు కోసం దరఖాస్తు పత్రంతో పాటు డిగ్రీ, డిప్లొమా, తత్సమాన విద్యార్హతల పత్రాలను సమర్పించాలన్నారు. ఏ మండలానికి చెందిన గ్రాడ్యుయేట్లు ఆయా మండల తహసీల్దార్ కార్యాలయంలో సమగ్ర వివరాలు, సర్టిఫికెట్ల జిరాక్స్ పత్రాలతో దరఖాస్తు పత్రాన్ని నాయబ్ తహసీల్దార్‌కు అందజేయాలని చెప్పారు. ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు ఫారాలు తీసుకోవడంతో పాటు, దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఫిబ్రవరి 6లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రాడ్యుయేట్లయిన ప్రభుత్వ ఉద్యోగులు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు ఇచ్చిన ధ్రువీకరణ పత్రంతో ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవీ శ్రీనివాస్‌రావు(కాంగ్రెస్), రావు అమరేందర్ రెడ్డి (బీజేపీ), ఎం.మణి (బీఎస్పీ), గొడుగు వెంకట్ (సీపీఎం), సయ్యద్ ఫైజుల్లా (ఎఐఎంఐఎం), శ్యామ్ సుందర్ (టీడీపీ), రజినీకాంత్ (వైఎస్సార్‌సీపీ) పాల్గొన్నారు.




### ఈ- కేవైసీ పేరుతో అడ్డగోలుగా దోపిడీ

- **పేరు మార్పిడి కోసం అధిక వసూళ్లు**
- **చార్జి రూ.300లే ఉన్నా సుమారు రూ.2వేల వరకు వసూలు**
- **రూ.500కే గ్యాస్ సిలిండర్‌కు సంబంధం లేకున్నా క్యూ కడుతున్న ప్రజలు**
- **వినియోగదారుల అవసరాన్ని క్యాష్ చేసుకుంటున్న గ్యాస్ డీలర్లు**

# గ్యాస్ ఏజెన్సీల దందా




**'సందట్లో సడేమియా' అన్న చందంగా గ్యాస్ ఏజెన్సీలు నయా దందాకు తెరలేపాయి. ఈ-కేవైసీ సాకుతో అడ్డగోలుగా దోపిడీకి తెగబడుతున్నాయి. ఈ - కేవైసీకి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరాకు ఎలాంటి సంబంధం లేకున్నా వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీల ఎదుట క్యూ కడుతున్నారు. ఇదే అదనుగా భావించిన కొందరు గ్యాస్ డీలర్లు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. గ్యాస్‌ను ఒకరి పేరుమీద నుంచి మరొకరి పేరు మీదకు మారిస్తే రూ.300 చార్జి చేయాలి. కానీ, రూ.1500ల నుంచి రూ.2వేలకు వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.**

మహబూబాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): ఈ-కేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) పేరుతో గ్యాస్ ఏజెన్సీలు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాయి. గ్యాస్ వినియోగదారుల ఈ- కేవైసీని పూర్తి చేయాలని ఆయిల్ కంపెనీలు గ్యాస్ ఏజెన్సీలను ఆదేశించాయి. ఇందుకు ఎలాంటి తుది గడువును విధించకపోగా, దశల వారీగా పూర్తి చేయాలని పేర్కొన్నాయి. కాగా, ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల కోసం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నది. ఇందులో భాగంగా రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా కోసం వినియోగదారుల నంబరుతోపాటు కంపెనీ పేరు, సంవత్సరానికి ఎన్ని సిలిండర్లు వాడుతున్నారనే వివరాలను దరఖాస్తులో నింపాలి. ఈ కేవైసీకి రూ.500కే గ్యాస్ సిలిండర్‌కు సంబంధం ఉందనుకొని వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీల ఎదుట బారులు తీరుతున్నారు. ఇదే అదనుగా భావించిన గ్యాస్ డీలర్లు దోపిడీకి పాల్పడుతున్నారు. వినియోగదారుల అవసరాన్ని గుర్తించిన గ్యాస్ డీలర్లు అధిక వసూళ్లకు పాల్పడుతున్నారు. మామూలుగా ఈ -కేవైసీ అయితే ఉచితంగా చేస్తున్నారు. ఒకవేళ గ్యాస్‌ను ఒకరి పేరు మీద నుంచి మరొకరి పేరు మీదకు మార్చినా లేదా చనిపోయిన వ్యక్తి నుంచి వారి కుటుంబ సభ్యుల పేరు మీద మార్చినా రూ.300 చార్జి చేయాలి. పేరు మార్పిడికి గ్యాస్ వినియోగదారుడి నంబర్, నాలుగు ఫొటోలు, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా నంబర్ (ఒకవేళ మరణించిన వ్యక్తి పేరు మీద గ్యాస్ కనెక్షన్ ఉంటే డెత్ సర్టిఫికెట్) జత చేసి రూ.300 చెల్లిస్తే పేరు మార్చాలి. కానీ, ఇది లేదు.. అది లేదని కుంటి సాకులు చెబుతూ వినియోగదారుల నుంచి వేలకు వేలు ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో వినియోగదారులు డీలర్లు అడిగినంత ముట్టజెబుతున్నారు. పేరు మార్పిడికి కొన్ని గ్యాస్ ఏజెన్సీలు రూ.వెయ్యి, మరికొన్ని ప్రాంతాల్లో ఏజెన్సీలు రూ.1500, రూ.1800ల నుంచి రూ.రెండు వేల వరకు వసూలు చేస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వినియోగదారుల బలహీనతను ఆసరాగా చేసుకొని డీలర్లు దోపిడీకి పాల్పడుతున్నా ఆయిల్ సంస్థలకు చెందిన సేల్స్ ఆఫీసర్లు ఏం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పౌరసరఫరాల సంస్థ అధికారులు, ఆయిల్ సంస్థలకు చెందిన అధికారులు గ్యాస్ డీలర్ల దోపిడీని అరికట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.


# 30లోపు డబ్బులు చెల్లించండి

**బాధితులను ఇబ్బందులకు గురిచేస్తే జైలుకే..**

**చిట్‌ఫండ్ సంస్థల యజమానులకు సీపీ హెచ్చరిక**



సుబేదారి, జనవరి 4 : బాధితులను ఆఫీస్ చుట్టూ తిప్పించుకోకుండా వెంటనే చిట్టీ డబ్బులు చెల్లించాలని, ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా చిట్‌ఫండ్ సంస్థల యజమానులను హెచ్చరించారు. అక్షర, భవితశ్రీ, అచల, కనకదుర్గ చిట్‌ఫండ్ సంస్థల యజమానులు శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్, సత్యనారాయణ, మణికంఠరెడ్డి, వంద మందికిపైగా చిట్‌ఫండ్ సంస్థల (అక్షర చిట్‌ఫండ్ బాధితులు 50మంది, భవితశ్రీ 15మంది, అచల 5, కనకదుర్గ నుంచి 9 మంది) బాధితులతో సీపీ గురువారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. చిట్‌ఫండ్ సంస్థల బాధితుల జాబితాను ఆయా యజమానులకు చూపించి ఎందుకు డబ్బులు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 16 వరకు మహిళా బాధితులకు, 30లోపు సీనియర్ సిటిజన్స్‌కు, వచ్చే నెల 15లోపు అందరికీ డబ్బులు చెల్లించాలని ఆదేశించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి డబ్బుల చెల్లింపుపై ప్రత్యేకంగా సమీక్ష చేస్తానని, మళ్లీ ఇదే రిపీటైతే పీడీ యాక్టులు పెట్టి జైలుకు పంపిస్తానని సీపీ హెచ్చరించారు. సమావేశంలో క్రైమ్ డీసీపీ మురళీధర్, చిట్‌ఫండ్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ వేణుమాధవ్ పాల్గొన్నారు.



కొత్తకొండ ఆలయంలో మంత్రి పొన్నం, ఎమ్మెల్యే నాగరాజుకు ఘన స్వాగతం పలుకుతున్న అర్చకులు

# భక్తులకు సకల సౌకర్యాలు

- **కొత్తకొండ జాతరలో ఇబ్బందుల్లేకుండా అన్ని వసతులు కల్పించాలి**
- **రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి**
- **రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

భీమదేవరపల్లి, జనవరి4: కొత్తకొండ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సకల సౌకర్యాలు కల్పించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. గురువారం మండలంలోని కొత్తకొండలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి భద్రకాళీ సమేత వీరభద్ర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి అర్చకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం కొత్తకొండ జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతరలో 605 మంది పోలీసు సిబ్బంది అవసరమని భావిస్తున్నామని సెంట్రల్ జోన్ డీసీపీ బారి పేర్కొనగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బాధ్యత తీసుకోవాలని మంత్రి సూచించారు. ఏటా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, రహదారికి ఇరువైపులా సైడ్ బర్మింగ్, గుంతలను పూడ్చడం, ప్రమాదకరమైన మూలమలుపుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. జాతరలో పారిశుధ్య నిర్వహణపై డీపీవో జగదీశ్వర్‌ను ప్రశ్నించారు. భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, వేలేరు మండలాల నుంచి ప్రత్యేకంగా శానిటేషన్ సిబ్బంది వచ్చి విధులు నిర్వర్తిస్తారని, చెత్తను సేకరించి ఎప్పటికప్పుడు ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తారని ఆయన సమాధానమిచ్చారు. జాతరలో విద్యుత్ కొరత లేకుండా చూడాలన్నారు. మేడారం జాతర దృష్ట్యా కొత్తకొండ బ్రహ్మోత్సవాలకు ఐదు లక్షల వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందని, సిద్దిపేట, హనుమకొండ, హుజూరాబాద్, హుస్నాబాద్ నుంచి నిరంతరాయంగా ఆర్టీసీ బస్సులు నడపాలని సూచించారు. అవసరమైన చోట బారికేడ్లు, అడుగడుగునా నిఘా నేత్రాలు, రూట్ మ్యాప్ జాతరలో తప్పనిసరిగా ఉండాలన్నారు. గుడుంబా, జూదం, మట్కా, ఈవ్‌టీజింగ్ పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. భక్తుల తాకిడిని తగ్గించేందుకు వీఐపీలకు సైతం టికెట్లు తీసుకోవాలని ఈవో కిషన్‌రావుకు సూచించారు. అనంతరం జాతర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ, ఆర్డీవో రమేశ్, దేవాదాయ శాఖ ఏసీ రామాల సునీత, కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజు, డిప్యూటీ తహసీల్దార్ గోపాల్, ఎంపీడీవో భాస్కర్, ఎంపీవో భాస్కర్, సర్పంచ్ ప్రమీల, ఎంపీటీసీ రాజమణి, ఉపసర్పంచ్ కృష్ణ, ఎల్కతుర్తి సీఐ ప్రవీణ్‌కుమార్, ముల్కనూరు, వంగర, ఎల్కతుర్తి ఎస్సైలు సాయిబాబు, వెంకటేశ్వర్లు, రాజుకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సేవాభావంతో విధులు నిర్వర్తించాలి

- **మేడారంలో భక్తులకు వైద్య సేవలు వేగవంతంగా అందించాలి**
- **రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్**

ములుగురూరల్, జనవరి 4 : మేడారం మహా జాతరలో వైద్య సిబ్బంది సేవా భావంతో విధులు నిర్వర్తిస్తూ, భక్తులకు వేగవంతమైన సేవలు అందించి జాతరను విజయవంతం చేయాలని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్ అన్నారు. ములుగు కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ములుగు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రోగ్రాం ఆఫీసర్లు, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య సిబ్బంది భక్తులకు నిస్వార్థమైన సేవలు అందించాలన్నారు. వైద్య శిబిరాల్లో సరిపడా సిబ్బందిని ములుగు జిల్లా నుంచే కాకుండా వరంల్, జనగామ, హనుమకొండ, భూపాలపల్లి, మహబూబాబాద్, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల నుంచి తీసుకోవాలని సూచించారు. అనంతరం రవీందర్‌నాయక్‌కు డీఎంహెచ్‌వో అప్పయ్య, వైద్యాధికారి రవీందర్‌నాయక్ మేడారం అమ్మవార్ల చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సమావేశంలో ములుగు, వరంగల్ డీఎంహెచ్‌వోలు డాక్టర్ అప్పయ్య, డాక్టర్ సాంబశివ రావు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్‌కు అమ్మవార్ల చిత్రపటాన్ని అందిస్తున్న వైద్యాధికారులు

# మహిళపై లైంగికదాడి

**వ్యక్తిపై కేసు నమోదు**

గీసుగొండ, జనవరి 4 : మహిళపై లైంగికదాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. వంచనగిరి గ్రామానికి చెందిన ఓ మహిళ అదే గ్రామంలో హోటల్ నడుపుతున్నది. కొద్ది రోజులుగా ధర్మారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తరచుగా హోటల్‌కు వచ్చి మాయమాటలు చెప్పి లైంగికదాడి చేశాడు. ఈ మధ్య అతడి వేధింపులు ఎక్కువవడంతో ఆమె తన భర్తకు జరిగిన విషయం చెప్పింది. గురువారం భర్తతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


## రెండు రోజులు నీటి సరఫరా బంద్

వరంగల్, జనవరి 4 : ధర్మసాగర్ నుంచి వచ్చే మిషన్ భగీరథ పైపులైన్‌కు అమ్మవారి పేట వద్ద ఏర్పడ్డ లీకేజీకి మరమ్మతుల నేపథ్యంలో (శుక్ర, శనివారాలు) 2 రోజుల పాటు నీటి సరఫరా ఉండదని బల్దియా ఈఈ శ్రీరామోజు శ్రీనివాస్ తెలిపారు. పైపులైన్ పరిధిలోని కరీమాబాద్, ఉర్సు, శివనగర్, పెరుకవాడ, చింతల్, ఖిలావరంగల్, తూర్పు కోట, మధ్య కోట, ఎస్‌ఆర్‌ఆర్ తోట, ఏసీరెడ్డి నగర్, నాగమయ్యగుడి, రుద్రమనగర్ ప్రాంతాల్లో 2 రోజులు నీటి సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

# నియోజకవర్గ ప్రజల మధ్యే ఉంటా

**బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్**

పర్వతగిరి, జనవరి 4: తన గొంతులో ప్రాణం ఉన్నంత వరకూ వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజల మధ్యే ఉంటానని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో గురువారం సమీక్షించారు. తాను నియోజకవర్గ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటున్నానని చెప్పారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతమే ప్రథమ కర్తవ్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. గ్రామాలే తనకు దేవాలయాలని, ప్రజలే దేవుళ్లన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఎవరూ అధైర్య పడొద్దన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను సర్పంచ్‌లు, ఎంపీటీసీలుగా గెలిపించుకోవడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. 2014, 2018లో బీఆర్‌ఎస్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేశారన్నారు. ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ కోసం పాటు పడిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా అరూరి కృతజ్ఞతలు తెలిపారు. మనది ఉద్యమ పార్టీ అని, ఉద్యమ స్ఫూర్తితోనే ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. త్వరలో జరుగబోయే సర్పంచ్, పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి గులాబీ జెండా ఎగరవేయాలని కోరారు. సమీక్షలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రంగు కుమార్‌గౌడ్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు సర్వర్, ఎంపీపీ కమల, పీఏసీఎస్ చైర్మన్లు మనోజ్‌కుమార్, గొర్రె దేవేందర్, వైస్ ఎంపీపీ రాజేశ్వర్ రావు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ జితేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు, సీనియర్ నాయకులు భాస్కర్‌రావు, వెంకటేశ్వర్‌రావు, ఆర్‌బీఎస్ మండల కోఆర్డినేటర్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పట్టాపురం ఏకాంతంగౌడ్, పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్